# విప్పని పెదవి

పేపరు చదువుతూన్న అఖిల కళ్లు తిరుగుతున్నట్టు అనిపించి పేపర్ని టేబులు మీద పడేసి, రెండు చేతుల్నీ టేబులు మీద సాచి, చేతులపైన తల ఆనించి కూర్చుంది. పేపర్లోని ప్రతి అక్షరం తనని చూసి నవ్వుతూన్నట్టని పించింది. "సారా నిషేధించండి! సంసారాన్ని రక్షించండి! తాగుబోతులను శిక్షించండి! వారి కుటుంబాలను కాపాడండి!' ఇంకా ఎన్నో ఎన్నో....ఏవోఏవో! ....కళ్ళముందు వంకరటింకరగా నాట్యం చేస్తున్నాయి. కలువరేకుల్లాంటి కళ్ళ నిండా నిండిన నీరు, ఒక్కసారి పొంగిపొర్లుతూన్నట్లుగా చెంపల మీదుగా కారి ముఖాన్ని తడిపేశాయి తల వెనక భాగం ఎడమవైపున, రోకటితో బాదినట్టు నొప్పి పుట్టింది. "అమ్మా...."అంటూ అరచేత్తో ఆ భాగాన్ని అదిమిపట్టుకుంది. ఆలోచనలు సుళ్ళు తిరుగుతూ ఆనాటి సంఘటనని గుర్తుచేశాయి. శేఖర్ తప్పతాగి, తూగిపోతూ ఇంటికొచ్చాడు అతడి చేతిలో ఒక బ్రాందీసీసా, పాంటు జేబులో మరో బ్రాందీ సీసా, చీకట్లో తళతళా మెరుస్తూ కనిపించాయి. గడియారం పన్నెండుగంటలు కొట్టింది. పుట్టినరోజునాడైనా సమయానికి ఇంటికొస్తాడని ఆశగా పిండివంటలతో సహా భోజనాన్ని తయారుచేసింది అఖిల. అతనికోసం ఎదురుచూస్తూ అర్ధరాత్రిదాకా అలాగే కూర్చుండిపోయింది. "ఈ ఒక్క రోజైనా తాగకుండా వుండలేకపోయారా? కనీసం ఇవాళైనా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోంచెయ్యాలని, తనివితీరా మాట్లాడుకోవాలని ఎన్నో కలలు కన్నాను. ఉదయం నుంచి మిమ్మల్ని ప్రాధేయపడుతూ వచ్చాను ఈ ఒక్క రోజు తాగకండని! 'అలాగే అలాగే' అంటూనే ఎటో ఎవరూ చూడకుండా వెళ్ళిపోయారు. ఛీ! మీరు మనుషులేనా? మీకు దయా దాక్షిణ్యాలు లేవా?" కోపంతో, అసహ్యంతో ఊగిపోతూ అంది అఖిల.

అతడికి ఏమర్థమయిందో లేదో, వెకిలిగా అఖిలమొహంలో మొహంపెట్టి చేతిలోని బ్రాందీ సీసాని ఆమెనోటికి అందిస్తూ, "హప్పీబ....ర్త్....డే....టూ..

యూ....మై....డియర్....వైఫ్....తాగ....పొట్టనిండా తాగు...." అంటూ బల వంతంగా బ్రాందీసీసాని ఆమె మూతికి అదిమి పెట్టాడు. ఆగ్రహం, అసహ్యం చోటుచేసుకున్న ఆమెగుండెలో కోపం రెచ్చిపోయింది. "ఛీ!"అంటూ ఒక్కతోపు తోసింది. శేఖర్ తూలి కుర్చీమీదపడ్డాడు. "నన్నుకొడతావా? దొంగ ముం....!" అంటూ పులిలా లేచి ఆమె మీదపడి జుట్టుపట్టుకుని లాగి, చెంపమీద అయిదు వేళ్ళు అంటుకునేలా కొట్టాడు. తాగినప్పుడు అతడిలో మామూలు శేఖరు కాదు, ఒక పైశాచిక శక్తి ఆవరించిన శేఖర్ కనిపిస్తాడు. చుర్రుమని తగిలిన దెబ్బని అరచేత్తో రాస్తూ "తాగొచ్చి పెళ్ళాన్ని కొట్టే నీచుడివి నువ్వు! నువ్వొక ఇంజ నీరువా? ఛీ! నీకన్నా కూలీనాలీచేసి పెళ్ళాన్నీ, బిడ్డల్నీ పోషిస్తున్న పక్క గుడిసెలో వున్న రంగన్న నయం" అంది కసిగా అఖిల.

"ఏం కూశావే! నీకు రంగన్న దేముడిలా కనిపిస్తున్నాడా? వాడితో లేచి పోదామనుకుంటున్నావా?" సీసాతో తలమీద బాదేడు. సీసాకింద పడి ముక్కలు ముక్కలైంది. తలమీద నుంచి కారుతూన్న రక్తం ఒక్కొక్క బొట్టే నేలమీద పడ్డ బ్రాందీలో కలిసిపోయింది. "అబ్బా! దుర్మార్గుడా!" అంటూ కుప్పకూలి పోయింది అఖిల. పక్క క్వార్టర్‌లో వున్న రాకేష్ దంపతులకు వీరి గొడవ నిత్యపారాయణం కాబట్టి మాట్లాడకుండా ఊరుకున్నా, ఆ చప్పుడుకి ఆమె అరుపుకి ఏదో జరిగి వుంటుందన్న ఆతృతతో వెళ్ళి, తలుపులు తెరిచే వుండ డంతో లోపలి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యబోయారు రక్తపు మడుగులో స్పృహ తప్పిపడి వున్న అఖిలను లేవనెత్తి మంచంమీద పడుకోబెట్టారు. వెంటనే కొంచెం దూరంలో వున్న డాక్టరుగారిని తీసుకొచ్చి ఆమె తలకి తగిలిన గాయానికి కట్టు కట్టించారు.

రాకేష్ భార్య సుమలత కింద పడున్న గాజు పెంకుల్ని తీసి పారేసి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసింది. ఆ గాయం మాని దాదాపు ఆరేళ్ళయినా ఇప్పటికీ ఉన్నట్టుండి కొట్టినట్టు నొప్పివొస్తూనే వుంటుంది. అలావొచ్చినప్పుడల్లా కళ్ళు మూసుకుని కాసేపు మంచం మీద పడుకుంటుంది. కాస్సేపటికి మెల్లగా అదే సర్దుకుంటుంది.

మెల్లగా లేచివెళ్ళి మంచంమీద వాలిపోయింది అఖిల. సినిమా రీలులా తన బతుకంతా కళ్ళముందు కదిలింది.

ప్రొఫెసర్ రామారావుగారి ఏకైక పుత్రిక, తల్లిదండ్రుల గారాల పట్టి, నలుగురు కొడుకుల తరువాత అపురూపంగా పుట్టింది అఖిల. బి.ఏ. పూర్తవగానే

ఏ అయ్యచేతిలోనో పెడితే ఎలా చూసుకుంటాడో ఏమోనని తన స్వంత చెల్లెలి కొడుకు శేఖర్‌కిచ్చి, అయినవాడు కదా అని పెళ్ళి చెయ్యాలనుకున్నారు. రామారావుగారు.

శేఖర్ బి.ఇ. ఎలక్ట్రికల్ ఫస్టుక్లాసులో ప్యాసయాడు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటులో అసిస్టెంట్ ఇంజనీరుగా సెలక్టయ్యాడు. తమ ముద్దుల బిడ్డ ఎంతో సుఖపడుతుందని ఆశించిన తల్లిదండ్రులకి శేఖర్ ప్రవర్తన ఎలక్ట్రిక్ షాక్‌లా తగిలింది. శేఖర్‌కి వుండవలసిన అవలక్షణాలన్నీ వున్నాయి. తాగుడూ, తిరుగుడూ, పేకాటా, సిగరెట్లు అంతా! ప్రొఫెసర్ రామారావుగారు తన సబ్జెక్టు ఫిలాసఫీలో గోల్డుమెడలు తెచ్చుకున్నా, జీవితంలో జీరోవచ్చినందుకు తట్టుకోలేక గుండె ఆగిపోతే, పైలోకానికి వెళ్ళిపోయారు. ఆ ఒక్క భయమూ, అటంకము కూడా తొలగిపోయేసరికి శేఖర్ మరింత విచ్చలవిడిగా తయారయ్యాడు. ఆఫీసుకి నెలలో ఏ రెండు మూడు రోజులో తప్ప వెళ్ళడం మానేశాడు. చివరికి సెలవు చీటీలు కూడా పెళ్ళాం ద్వారా పంపించి తాను సీసాలతో వెళ్ళబుచ్చుతూ వొచ్చాడు. అఖిల నోరువిప్పి ఇదేమిటని అడిగిందో అంతే జుట్టు చేతిలోకొచ్చి తలలోని నరాలు చిట్టిపోవలసిందే! సిగరెట్టు పీకలతో వొంటిమీద చుక్కలముగ్గులు పెట్టి, అఖిల బాధతో విలవిలలాడుతూవుంటే, తృప్తిగా ఆనందించేవాడు. ఆ బాధపడలేక అతని చేతికి పట్టువుండకుండా వుండడానికి జుట్టు బాబ్ చేసుకుంది వొంటిమీది చురకలు కనబడకుండా పమిట చెంగును మెడనిండా తిప్పి, వొళ్ళంతా కప్పేసుకునేది. బంధువులు అందరూ ఆధునిక స్టైల్ అని ఆక్షేపించారు దానికి తోడు ఆమె కడుపు పండకపోవడంతో "గొడ్రాలు" అంటూ కూడా ప్రచారం చేశారు. తన కడుపు పండకపోవడానికి, తన బతుకు నలుగురిలో నవ్వులపాలు కావడానికి తన భర్తే కారణం అని మధ్యతరగతి మహిళ అఖిల చెప్పలేక పోయింది. ఆదుకోమని ఎవ్వర్నీ నోరు విప్పి అడగలేకపోయింది.

ఉన్నట్టుండి ఒక రోజు అఖిల అడపడుచూ, బావగారూ ఊడిపడ్డారు ఊరినుంచి.

"వొదినా! తాగుడికి బానిసై పోయిన వాళ్ళకి సైకలాజికల్ ట్రీట్‌మెంట్ యిస్తే తాగుడు మానేస్తారట. పేపర్లో చదివాను. అందుకే అన్నయ్యని

కూడా వెంటబెట్టు కొచ్చాను. డబ్బేమైనా వుందా? సాయంత్రం డాక్టరు దగ్గర అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాం." అంది అమిత ప్రేమగా ఆడపడుచు హరిణి.

అతను సరిగ్గా ఉద్యోగానికి వెళ్లక అప్పులతో, అనారోగ్యంతో అవస్థ పడుతూన్న అఖిల ఆశ్చర్యంగా చూసింది హరిణికేసి. చక్రాల్లాంటి ఆమె కళ్లల్లో నుంచి దూసుకువస్తున్న చూపుల బాణాలను తట్టుకోలేక తలదించుకుంది హరిణి.

పెద్దకళ్లూ, పచ్చనిఛాయ, గుండ్రటి మొహం- "చక్కనమ్మ చిక్కినా బాగుంటుం దన్నట్టు కష్టాల్లో వున్నా కరిగిపోని అఖిల అందం, హరిణికి అసూయ కలిగించింది.

అందుకే డాక్టర్ నీలకంఠం చాటుగా అడిగిన ప్రశ్నలకి తప్పుడు సమాధానాలు చెప్పింది హరిణి. 'మా వదిన ప్రవర్తనవల్లే అన్నయ్య తాగుడికి అలవాటు పడ్డాడని చెప్పింది. అసలు నెలకి రేషన్ కొన్నట్టుగా తనే సీసాలు తెచ్చి అతడికి యిస్తుంది. తన ప్రవర్తనకి అతడు అడ్డు రాకూడదని అలా చేస్తుంది' అని చెప్పింది ఆమెలోని అసూయనంతా వెళ్లగక్కుతూ.

అంతా విన్న నీలకంఠం గారు "ఆమెందుకు నా దగ్గరికి రాలేదు?" అడిగారు.

"మొహం చెల్లక రాలేదు. రావడానికి ఆమెకి ఇష్టంలేదు కూడా" అంది హరిణి ప్రతి అక్షరం నొక్కి పలుకుతూ.

కాస్సేపు ఆలోచించి నీలకంఠంగారు "అతడిని ఈ వూరినుంచి కొన్నాళ్ళపాటు ఎక్కడికైనా బదిలీ చేయించండి. భార్య కొద్దికాలం అతనికి దూరం వుండేలా చూడండి" అన్నారు.

వెంటనే ఆఫీసులో ఎవరినో పట్టుకుని ఈ పట్నం నుంచి చిన్నవూరికి అతడిని ట్రాన్స్‌ఫర్ చేయించింది హరిణి. "డాక్టరు నిన్ను కొంతకాలం అన్నయ్యకి దూరంగా వుండమని చెప్పేడు. దానివల్ల మంచి ఫలితం తొందరలోనే వుంటుందిట" అంది అఖిల. డాక్టరు ఫీజులకి, తమ రైలు ఖర్చులకి అయిన మొత్తాన్ని వసూలు చేసి, తిరిగి వెళ్లి పోయింది హరిణి.

తిట్టుకున్నా కొట్టుకున్నా భర్త కళ్లముందు లేకపోయేసరికి దిగులు పడింది అఖిల. శేఖర్ జీతం కూడా పంపించడం మానేశాడు. ప్రతిసారి అన్నదమ్ముల దగ్గరే అసరా అందుకుంటున్న అఖిల మరి వారి సహాయం అడగలేక చిన్న చిన్న ట్యూషన్లు చెప్పడం మొదలెట్టింది.

మూడుముళ్లబంధం కావొచ్చు. భార్యభర్తల సంబంధం కావొచ్చు. శేఖర్ కూడా అఖిలని చూడాలని అరాటపడ్డాడు. తిట్టినా కొట్టినా పుట్టింటికైనా వెళ్లకుండా తన దగ్గరే పడుండే అఖిల వేరే ఊరు బదిలీ అయి వెళుతున్నా తనకంట బడక, తన వెంట రాకపోవడం కష్టంగానే అనిపించింది. శేఖర్‌కి. అంత చేదులోనూ ఎక్కడో అంతరంగంలోని అడుగు పొరల్లో దాగివున్న తీపి గురుతులూ, పెళ్ళినాటి ప్రమాణాలూ జ్ఞాపకం వొచ్చి, తన ప్రవర్తనకి తానే సిగ్గుపడి, ఒకటి రెండుసార్లు రమ్మని, పశ్చాత్తాపంతో, ప్రాధేయపడుతూ ఉత్తరాలు రాశాడు శేఖర్.

ఈ పశ్చాత్తాపాలూ, ప్రాధేయపడడాలూ అన్నీ తాత్కాలికమే అని తెలుసు అఖిలకి. అయినా ఏదో అనుబంధం ఆమెని ఇలా ఒంటరిగా వుండడం కన్నా, అతని సన్నిధిలోనే వుండాలని ముందుకు తీసుకెళుతోంది. డాక్టరు నీలకంఠంగారి దగ్గరికెళ్ళి అతని పర్మిషన్ అడిగింది భర్త దగ్గరికి వెళ్ళడానికి. ఆమెని చూసి నివ్వెరపోయారు డాక్టర్ నీలకంఠం. అఖిలతో మాట్లాడిన అయిదు నిముషాల్లోనే ఈమెను గురించి హారిణి చెప్పిన మాటలు అబద్ధాలని తేలిపోయాయి. వెంటనే వెళ్ళడానికి అనుమతించారు.

ప్రయాణానికి సిద్ధమవుతున్న అఖిల ఇంటి ముందు ఆగి హారన్ కొడతున్న వ్యాను కేసి చూసింది. కాళ్ళకింద భూమి బద్దలయిపోయినట్టయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. శేఖర్ శవాన్ని నలుగురు మోసుకొస్తున్నారు. మరి కొందరు లోపలికొచ్చి ఏదో చెబుతున్నారు "రాత్రి....హార్ట్ ఆటాక్....మిమ్మల్నే కలవరించారు .... అయినా అప్పుడూ మైకంలోనే వున్నారు. రోజంతా తాగుతూనే వున్నారు. మనిషి మంచివాడు. ఈ తాగుడు అలవాటువల్లే పతనమైపోయాడు." నలుగురూ నాలుగు మాటలు మాట్లాడుతున్నారు.

అఖిల నోట మాట రాలేదు! కళ్ళంట నీళ్ళు రాలేదు!

స్థాణువులా వుండిపోయింది!

డాక్టర్ని పిలిపించారు. అఖిలకు ఏవో మందులిచ్చి పడుకోబెట్టారు. తరువాత అంతా మామూలే! జరగవలసిన కార్యక్రమాలు జరిగిపోయాయి!

*　　　*　　　*

అఖిల ఆలోచిస్తోంది! కనీసం పూరిగుడిసెల్లోంచి పుట్టుకొచ్చిన ఈ సారా వుద్యమం ఇంతవరకు ఎదిగింది! ఎందరి పుస్తెలనో పుటుక్కుమనకుండా వుండడానికి దోహద పడుతుంది. ఇది బహిరంగంలా తెలిసిన విషయం. కానీ, మధ్య తరగతి కుటుంబాలు "బ్రాందీ" బురఖాల్లో 'రమ్' రంగుల్లో కాలి మాడి మస్సై పోతూవుంటే, నాగరికత ముసుగులో నలిగిపోవడం తప్ప నోరు మెదప లేని నారీమణులకు ఎవరు ఏ నినాదం ఇవ్వాలి? ఎలా పోరు సలపాలి?

గుండె పగిలిపోతున్నా పెదవిపై చిరునవ్వులు గుమ్మరించే శక్తి మధ్య తరగతికి శాపమా? వరమా? దీనికి ఆరంభం ఎప్పుడు? ముగింపు ఎక్కడ?

అర్థం లేని ప్రశ్నలతో బుర్ర వేడెక్కి పోగా, గుండెలో సలసల కాగిన జలం కళ్ళలోంచి వేడిగా చెంపల మీద ధారగా కారుతూంటే, పిచ్చిదానిలా దిక్కులు చూస్తూ పడుకుంది అఖిల.

"ఈ అఖిలాండకోటిలోని మూగజీవులు పశువులు కాదు - మధ్యతరగతి మహిళామణులు!" ఆమెను మనసు నినాదంలా పలుకుతోంది ఈ మాటలు! 'ఈ నాటికీ, ఆరడి పెట్టే అత్తమామలు, అసూయతో కొంపలుకూల్చే ఆడ పడుచులూ, చాలీచాలని ఆర్థిక దుస్థితి, అనారోగ్యం, ఆచారాలు, ఆర్భాటాలూ, దురలవాట్లు - వీటిమధ్య నలిగిపోతూన్న మధ్య తరగతి కుటుంబంలోకి, కొత్త పెళ్ళికూతురిలా, కొత్త ఆశలతో అడుగుపెట్టిన మహిళ తన మనసులోని భావాలని పెదవి విప్పి, చెప్పలేక పోతుంది! బండెడు కష్టాలనీ, కుండెడు కన్నీళ్ళనీ గుండెనిండా నింపు కోవడంకోసం ఆశల్ని చంపుకుని గుండె ఖాళీ చేసుకుంటోంది! కాలం మారినా మహిళల బ్రతుకులు మారలేదు!' పెదవి విడివడకుండానే గొణుక్కుంది అఖిల.

*